క్లుప్తంగా

నెట్టికంటుడి సేవలో జడ్జి



జడ్జి శ్రీహరికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: గుత్తి ఆరో అడిషినల్ జిల్లా జడ్జి ఎం.శ్రీహరి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయానికి వచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు జడ్జి కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

వాతావరణానికి అనుగుణంగా పంటలు పెట్టాలి

బుక్కరాయసముద్రం: వాతావరణానికి అనుగుణంగా పంటలు సాగు చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్ బాబు రైతులకు సూచించారు. శనివారం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ శాఖ అధికారులతో సంయుక్తంగా వ్యవసాయ శిక్షణ నిర్వహించారు. రేకులకుంట పరిశోధన స్థానం, రెడ్డిపల్లి, కళ్యాణదుర్గం కేవీకేల శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు హాజరయ్యారు. డాక్టర్ విజయ శంకర్‌బాబు మాట్లాడుతూ రైతులు పంటల సాగులో శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. ఆత్మా పీడీ మద్దిలేటి, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

28 మందికి ఉద్యోగాలు



నియామక పత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మయ్య

గుంతకల్లుటౌన్: ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో శనివారం ఎయిల్ డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 28 మంది యువతులకు ఉద్యోగవకాశాలు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 58 మంది యువతులు హాజరుకాగా కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచిన 28 మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు.


స్వీయరక్షణపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న సీడీపీఓ సాజిదాబేగం

తాడిపత్రి రూరల్: విద్యార్థులు స్వీయరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీడీపీఓ సాజిదాబేగం సూచించారు. పట్టణ సమీపంలోని కేజీబీవీ పాఠశాల, పట్టణంలోని త్రిబుల్ ఎస్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాలల్లో శనివారం సెల్ఫ్ డిఫెన్స్‌పై నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు ఆమె అవగాహన కల్పించారు. అనంతరం కరాటే మాస్టర్లు మురళి, షేక్షావలి స్వీయ రక్షణ మెలకువలు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, విజయకుమారి, పల్లవి కల్చరల్ టీం రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాఘ మాసం శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజి, సభ్యులు నాగయ్య, నరసింహులు, విజయ్, శేషు, బొంగుల సురేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు: కోనాపురంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. రమేష్‌బాబు శనివారం ఉదయం పెద్దవడుగూరు నుంచి ద్విచక్రవాహనంపై పాఠశాలకు వెళ్తుండగా మార్గం మధ్యలో చింతలచెరువు సమీపంలో పొలాల్లోంచి ట్రాక్టర్ ఉన్నపళంగా రోడ్డుపైకి రావడంతో ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన ప్రధానోపాధ్యాయుడిని స్థానికులు గమనించి పెద్దవడుగూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించిన తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

పని కావాలంటే.. చెయ్యి తడపాల్సిందే!



- ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల ప్రదక్షిణలు
- అవినీతికి కేరాఫ్ పామిడి తహసీల్దార్ కార్యాలయం

పామిడి: కూటమి ప్రభుత్వం కొలువయ్యాక తహసీల్దార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. కొందరు రెవెన్యూ అధికారులు పైసా కొట్టందే...పని చేయని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ ఇతరత్రా సర్టిఫికెట్ కావాలంటే కొంత మంది వీఆర్వోలు వేల రూపాయలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇకపోతే కొందరు గ్రామ సర్వేయర్లు భూమి కొలతలు సర్వే చేయాలంటే.. ముడుపులు చెల్లిస్తే తప్పా.. భూమివైపు కన్నెతి చూడడం లేదని తెలుస్తోంది.

చక్రం తిప్పుతున్న అవినీతి అధికారి..

ఆ అధికారిది కార్యాలయం డ్యూటీ కాదు. అతడిది పొలాల సర్వే పర్యవేక్షణ డ్యూటీ. అలాంటి అధికారికి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్యాలయంలో ఓ బాధ్యతాయుత పోస్టును కార్యాలయ బాస్ కేటాయించారు. ఎక్కడ పనిచేసినా ఆయనది అవినీతి ట్రాకే అన్నది విశ్వసనీయ సమాచారం. గతంలో ఆ అవినీతి అధికారిని ఓ రెవెన్యూ ఉన్నతాధికారి సస్పెండ్ చేశారు. రెండేళ్ల అనంతరం ఆయన డ్యూటీలో చేరాడు. రెండేళ్లు వేరే మండలంలో పని చేసిన తర్వాత పామిడికి వచ్చాడు. ఇక్కడి కార్యాలయపు బాస్ నిబంధనలకు నీళ్లు ఒదిలి అతనికి కార్యాలయంలో రెవెన్యూ పరమైన ఓ కీలక పోస్టు ఇచ్చాడు. అప్పటికే అవినీతిలో మునిగి తేలిన అతను తిరిగి పామిడిలో అవినీతి దందాకు తెరలేపాడన్న ఆరోపణలు షికార్లు కొడుతున్నాయి. అయనకు పొలానికి సంబంధించిన మ్యుటేషన్‌కు దరఖాస్తు వచ్చిందంటే పండుగే. మ్యుటేషన్ చేయనున్న భూమి మార్కెట్ ధరను బట్టి రూ.వేలు, రూ.లక్షల్లో అక్రమార్జనకు తెరలేపుతున్నాడన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మామూలుగా కార్యాలయ సమయం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే. అయితే పనివేళలు ముగిశాక అవినీతి దందా యథేచ్ఛగా కొనసాగిస్తూ వాటాలు పంచుకుంటున్నారు.



రాత్రి పూట తెరచుకున్న పామిడి తహసీల్దార్ కార్యాలయం

అటకెక్కిన రీ సర్వే

మండలంలో రీసర్వే అటకెక్కింది. రీసర్వేను పర్యవేక్షించి గాడిలో పెట్టాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడడం లేదన్న ఆరోణలు గుప్పుమంటున్నాయి. చేతివాటానికి అలవాటు పడ్డ కొందరు గ్రామ సర్వేయర్లకు రీ సర్వే పండుగ అయ్యిందన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇందులో రీసర్వేకు నోచుకున్న ఎద్దులపల్లిలో తప్పుల తడక రీసర్వే నిలువుటద్దంగా నిలుస్తోందన్న బహిరంగ ఆరోపణలు ఉన్నాయి.

సామాన్యులకు సవాలక్ష కొర్రీలు

రెవెన్యూపరమైన సమస్యపై కార్యాలయానికి వెళ్లే సామాన్యులకు సవాలక్ష కొర్రీలతో అధికారులు తిప్పలు పెడుతున్నారు. అదే రూ. లక్షల్లో ముడుపులు వస్తాయంటే నిబంధనలు సైతం వారు తుంగలో తొక్కి తామే స్వయంగా ఫీల్డ్‌కు వెళ్లి అప్పనంగా వారికి కట్టబెట్టేందుకు సైతం వెనుకాడడంలేదు. పామిడి పట్టణంలోని హైవేకు గల ఓ భూయజమాని తన భూమిలో పబ్లిక్ వినియోగ నిమిత్తం దానంగా ఇచ్చారు. ఒకసారి దానం చేశాక తిరిగి తీసుకోవడానికి లేదు. అలాంటి భూమిని కొన్న ఓ వ్యక్తికి కట్టబెట్టేందుకు ఏకంగా బాస్‌తో పాటు సర్వే అధికారి, ఆ అవినీతి అధికారి స్వయంగా హైవేకు గల ఆ భూమిని పరిశీలించి సర్వే చేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి, సదరు వ్యక్తికి ఆభూమిని వర్తింపజేయడానికి ఆ ముగ్గురు అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు ఎర చూపడంతోనే.. వారు అత్యుత్సాహం చూపుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రధానంగా సస్పెండయిన ఆర్ఐ, బదిలీ అయిన సర్వేయర్ లాగిన్లను వాడుతూ అక్రమ దందా కొనసాగిస్తున్నారు. ఇదిఇలా ఉంటే ఎలక్షన్ డ్యూటీపై వచ్చిన ఆపరేటర్‌ను కార్యాలయ ఆపరేటర్‌గా వినియోగిస్తుండడంపై విమర్శలు లేకపోలేదు. ఈ అవినీతి తంతు తెలిసిన రెగ్యులర్ కంప్యూటర్ ఆపరేటర్, ఆర్ఐ తమ బాధ్యతలు స్వీకరించడానికి సాహసించడం లేదన్నది సమాచారం.

అవినీతికి తావే లేదు



తహసీల్దార్ కార్యాలయంలో అవినీతికి తావేలేదు. కార్యాలయానికి పని కోసం వచ్చిన ప్రజలకు సత్వర న్యాయం చేకూరుస్తున్నాం. కొందరు పనిగట్టుకొని కార్యాలయంపై అవినీతి బురద జల్లుతున్నారు. రెవెన్యూ పరమైన సమస్యలు పేరుకు పోవడంతో రెగ్యులర్ ఉద్యోగుల సమస్య తలెత్తడంతో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేశాం. సమస్యల పరిష్కారం కోసమే కాస్త లేటుగా కార్యాలయం నుంచి వెళ్తునామే?తప్పా? మరేమీలేదు. ఇకపోతే రెవెన్యూ పరమైన సమస్యలు, రీసర్వేకు సంబంధించి తరచూ గ్రామాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నా.

– ఎస్ శ్రీధరమూర్తి, తహసీల్దార్, పామిడి

మహిళా కౌన్సిలర్లకు గౌరవమివ్వండి

గుంతకల్లుటౌన్: వార్డుల్లో సమస్యలను లేవనెత్తిన మహిళా కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇచ్చి మాట్లాడటం నేర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నీలావతి, లింగన్న సూచించారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌పీ కౌన్సిలర్ రంగమ్మ మాట్లాడుతూ సరస్వతీ విద్యామందిరం నుంచి శ్మశానవాటికకు వెళ్లే దారిపై నిత్యం మురుగుని ఉంటోందని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ఆమె అధికారులను నిలదీయడంతో కమీషనర్ నయీమ్ దురుసుగా జవాబిచ్చారు. కమిషనర్ తీరును వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నీలావతి, లింగన్న తప్పుబట్టారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై మీ జులుం ప్రదర్శించవద్దని హితవు పలికారు. 37 వార్డులను సమాన దృష్టితో చూసి అభివృద్ధి పనులు చేయాలన్నారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారు. ప్రీ ఆడిట్ వారు అన్నింటికీ కొర్రీలు వేస్తూ సీఎఫ్‌ఎంఎస్‌లో నమోదు చేయడానికి ఐదారు నెలల సమయం తీసుకుంటే కొత్త పనులు ఎలా జరుగుతాయని కౌన్సిలర్ జేసీబీ చాంద్‌బాషా అధికారులను నిలదీశారు, ఇంజినీరింగ్, అకౌంట్స్ విభాగాల మధ్య సమన్వయం కొరవడిందని, అకౌంట్స్ ఆఫీసర్ దగ్గర మాట్లాడాలని వెళ్తే కనీసం కాంట్రాక్టర్‌లకు కుర్చీలను ఏర్పాటు చేయలేని దుస్థితి ఏర్పడిందని ఆయన మండిపడ్డారు. కౌన్సిలర్ కృపాకర్ మాట్లాడుతూ ప్రీ ఆడిట్ అధికారులతో చర్చించి సకాలంలో బిల్లులయ్యే చూడాలని కోరారు. అలాగే పట్టణంలో కుక్కల బెడదను తగ్గించాలన్నారు. కౌన్సిలర్ కుమారి మాట్లాడుతూ తన వార్డులో సింటెక్స్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని, పార్క్ ప్రాంతంలో ముళ్లకంపల తొలగించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని వార్డుల్లో నీటి సమస్యలేకుండా చూడాలని ఇంజనీర్లకు చైర్‌పర్సన్ సూచించారు. అనంతరం పలు వార్డుల్లో చేపట్టదలచిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ భవాని



కమిషనర్ తీరును తప్పుపడుతున్న కౌన్సిలర్ కె.నీలావతి

బీసీ హాస్టల్ పనుల పరిశీలన

యల్లనూరు: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్లో జరుగుతున్న ఫ్లోరింగ్, మరుగుదొడ్ల పనులను మండల ప్రత్యేకాధికారి రఘునాథ్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి శనివారం పరిశీలించారు. రూ. 11.46 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వార్డన్ శివారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టరు సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయను నివారిద్దాం

యాడికి: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని కొండకిందవీధిలో ప్రభుత్వ వైద్యాధికారి పరమేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించినట్లు టీబీ సూపర్‌వైజర్ సునీల్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు వస్తున్నా, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోతే గళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ రాంప్రసాద్‌గౌడ్, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

తాడిపత్రి రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని రూరల్ ఏఈ సుదర్శన్‌రెడ్డి శనివారం తెలిపారు. అనంతపురం రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులను దృష్టిలో ఉంచుకుని ఆటోనగర్, యర్రగుంటపల్లి, దిగువపల్లి గ్రామాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

24న ఎర్రితాత, పక్కీరప్ప రథోత్సవం

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ పంచాయతీ పరిధిలోని పెన్నప్పగుడి వద్ద ఈ నెల 24న ఎర్రితాత, పక్కీరప్ప 24వ రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శనివారం గ్రామస్తులు తెలిపారు. అలాగే 25, 26 తేదీల్లో వరుసగా న్యూకేటగిరి, ఆరుపళ్ల విభాగ ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. న్యూకేటగిరి విభాగపు విజేత వృషభాలకు వరుసగా రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు బహుమతులు ఉంటాయన్నారు. అలాగే ఆరుపళ్ల విభాగ ఎద్దుల పోటీ విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈసందర్భంగా అన్నదానం నిర్వహిస్తామన్నారు.

ఒత్తిడిని జయించండి

పుట్లూరు: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించి విద్యను అభ్యసించాలని మానసిక ఆరోగ్య కౌన్సిలర్ లక్ష్మీపతి సూచించారు. వారం రోజులుగా మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ విద్యార్థులకు విద్యాపరమైన ఒత్తిడులు, డిప్రెషన్, మానసిక సమస్యలపై పలు సూచనలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాల్లో భాగంగా శనివారం రాత్రి గ్రామస్తుల ఆధ్వర్యంలో స్వామి వారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పల్లకీ సేవ తిలకించారు.

వృద్ధురాలి మృతి

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లకు చెందిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు.శనివారం ఎస్‌ఐ మాట్లాడుతూ లక్ష్మీదేవి(65) అనే వృద్ధురాలు ఈనెల 16న రోడ్డు ప్రమాదంలో గాయపడింది. స్థానికులు 108లో ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారం రోజులు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆమెకు భర్త, ముగ్గురు కుమార్తెలు, కొడుకు ఉన్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లికి చెందిన తిమ్మప్ప అనే వృద్ధుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లి టోల్ గేట్ సమీపంలో ఉన్న పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సమీప పొలాల రైతులు 108 ద్వారా అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడి మృతి

పామిడి: మండలంలోని పీ కొండాపురం గ్రామానికి చెందిన టీచర్ వెంకటేష్(48) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు తదితరులు మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తంచేశారు.

శనగపొట్టు ఎత్తుకెళ్లిన దుండగులు

తాడిపత్రి రూరల్: మండలంలోని జంబులపాడులో ఇద్దరు రైతులకు చెందిన రూ.40 వేలు విలువ చేసే శనగపొట్టును దొంగలు ఎత్తుకెళ్లారు. శనగ పొట్టు అపహరణపై శనివారం బాధితులైన రైతులు మోహన్, రఘువీర అప్‌గ్రేడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.సీసీ పుటేజీల్లో కనిపించిన ట్రాక్టర్‌తో పాటు డ్రైవర్, కూలీలను గుర్తించడంతో భాగంగా పోలీసులు గాలింపు చేపట్టారు. అనుమానంతో ఒక ట్రాక్టర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌కు చెందిన డ్రైవర్‌తో పాటు ఇతరులను విచారిస్తున్నారని తెలుస్తోంది.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

పెద్దవడుగూరు: మండలంలోని మిడుతూరు గ్రామం సమీపంలోని 44 నెంబర్ జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడి ఏడుగురు గాయపడ్డారు. వివరాలు.. శనివారం పామిడి, కొప్పలకొండ, కల్లూరు అగ్రహారానికి చెందిన పది మంది గుత్తిలోని చర్చిలో ప్రార్థనలు ముగించుకుని తిరిగి ప్రయాణంలో మిడుతూరు గ్రామానికి దగ్గరకు రాగానే టైర్ పగిలిపోవడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో నాగరాజు, అరవింద్, నల్లమ్మ, జయమ్మ, మారుతమ్మ, జయలక్ష్మి, రమాదేవి గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను గుత్తి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యార్థులందరూ స్కౌట్స్‌లో చేరాలి

గుత్తి/యాడికి/పెద్దవడుగూరు: విద్యార్థులందరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలంటే స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరాలని హిందూస్తాన్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజేషన్ కమిషనర్ అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. గుత్తిలోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం వరల్డ్ స్కౌట్స్ డే ఘనంగా నిర్వహించారు. ఆయ మాట్లాడుతూ స్కౌట్స్‌లో చేరితే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగు పర్చుకోవచ్చన్నారు. గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యాడికి మండలంలోని రాయలచెరువులో ప్రధాన మంత్రి రైజింగ్ స్కూల్ (ఉన్నత పాఠశాల)లో నూతనంగా ఏర్పడిన స్కౌట్స్ అండ్ గైడ్ గ్రూప్ సభ్యులు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం డేనియల్, స్కౌట్ మాస్టర్ క్రిష్టారెడ్డి, గైడ్ కెప్టెన్ లక్ష్మీకాంతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెద్దవడుగూరులోని జెడ్పీ పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీవైఈఓ శ్రీదేవి, ప్రధానోపాధ్యాయురాలు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కెప్టెన్ అక్కమ్మ స్కౌట్ అండ్ గైడ్ జిల్లా ప్రతినిధులు పెద్దిరెడ్డి, బొమ్మయ్య, డీటీసీ విజయ్‌కుమార్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఉయ్యాలవాడ జయంతి

గుంతకల్లుటౌన్/బుక్కరాయసముద్రం: పట్టణంలోని రెడ్డి సంఘం కార్యాలయంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి , వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, కోశాధికారి నీలకంఠరెడ్డి, సంఘం నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, హనుమంతరెడ్డి, నాగభూషణంరెడ్డి, భీమలింగారెడ్డి, గోవింద్ రెడ్డి, అనంతసేనరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, చెన్నారెడ్డి, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రం మండలంలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్ బాబు, ఆత్మా పీడీ మద్దిలేటి, శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఎస్‌ఆర్‌ఐటీ ప్రభంజనం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న 16 మంది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి తెలిపారు. కళాశాలలో హెచ్‌సీఎల్ టెక్నాలజీ వారు 2024–25 క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారన్నారు. ఇందులో కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించారన్నారు. వారికి వార్షిక వేతనంగా 6 లక్షల ప్యాకేజి అందజేస్తారన్నారు.సర్వీస్ నౌ సీఎస్ఏ, సీఏడీలో ప్రపంచ వ్యాప్తంగా సర్టిఫికెట్ పొందిన విద్యార్థుల కోసం ఈ ప్రత్యేకమైన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నియామక కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కరెస్పాండెంట్‌తోపాటు కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బాలక్రిష్ణ, అధ్యాపకులు అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి

అండగా ఉంటాం



భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: పెద్దవడుగూరు మండలానికి చెందిన భాస్కర్‌రెడ్డి, అతని తమ్ముడు రామ్మోహన్‌రెడ్డిని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం పరామర్శించారు. గత 19న పెద్దవడుగూరు మండలం అప్పేచర్లలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వారు జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయన వారిని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గొడవకు గల కారణాలను తెలుసుకున్నారు.

పరామర్శ

పామిడి: పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామాంజినేయులు తల్లి లక్ష్మి(65) శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ నాగూరు ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.5వేలు నాగూరు ఈశ్వర్‌రెడ్డి అందజేశారు. అనుంపల్లి సూరి, శివ పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

అనంతపురం కార్పొరేషన్/శింగనమల: అనంతపురం సర్వజనాస్పత్రిలో అడ్మిషన్‌లో ఉన్న శింగనమల మండలం నాగులగుండం తండాకు చెందిన గిరిజనులను వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్ శనివారం పరామర్శించారు. ఈ నెల 21న గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద బొలెరో వాహనం ప్రమాదానికి గురైై సోనియా బాయి, నీలాక్షి, రామక్క తదితర కూలీలు గాయపడ్డారు. వీరిని శ్రీనివాసులు నాయక్ పరామర్శించారు. 11 మంది గిరిజనులు ప్రమాదానికి గురైతే ప్రభుత్వం ఏమాత్రమూ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.రవికుమార్ నాయక్, డీ భాస్కర్ నాయక్, రమేష్ నాయక్, లక్ష్మణ్ నాయక్, మోటో నాయక్ ఉన్నారు.

పాఠశాలకు ఆంప్లిఫైర్ వితరణ

గుంతకల్లు రూరల్: మండలంలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి సురేష్ గౌడ్ శనివారం రూ.20 వేలు విలువగల ఆంప్లిఫైర్‌ను బహూకరించారు. హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ ఈడిగ ప్రసాద్, గంగాధర్ గౌడ్, డిష్ పుల్లయ్య, నక్కా ఓబులేసు, వెంకటేష్, వలి, ఆదిశేషు, అంజనేయులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' నిధులు వెనక్కు..

పామిడి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో నాడు-నేడు పథకం కింద మండలంలోని ఎన్నో పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా నోచుకున్నాయని రామగిరి ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ అన్నారు. అలాంటిది ఎంఈఓ జయానాయక్ పుణ్యమా? అంటూ మండలంలోని రామగిరి యూపీ స్కూల్‌కు నాడు-నేడు పథకం కింద మంజూరైన రూ.60 లక్షలు నిధులు వెనక్కు వెళ్లాయని ధ్వజమెత్తారు. దీంతో ఆ యూపీ స్కూల్‌లో నెలకొన్న అసౌకర్యాలు విద్యార్థుల పాలిట శాపంగా మారాయన్నారు. దీంతో విద్యార్థుల చదువు కుంటుపడుతోందన్నారు. తద్వారా ప్రభుత్వం తక్షణం స్పందించి అసౌకర్యాల నడుమ కొట్టుమిట్టాడుతున్న యూపీ స్కూల్ సమస్యలను పరిష్కరించి, విద్యార్థుల విద్యాభ్యాసాన్ని సుగమం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కలాం ఆశయ సాధనకు పాటుపడదాం



మౌలానా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

గుంతకల్లు/గుంతకల్లుటౌన్: స్వాతంత్ర్య సమర యోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ఆశయాల సాధనకు పాటుపడుతామని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఖలీల్, కౌన్సిలర్ జేసీబీ చాంద్‌బాషా అన్నారు. కలామ్ 67వ వర్ధంతి సందర్భంగా శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్అండ్‌బీ సర్కిల్‌లోని మౌలానా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ అనుబంధ సంఘాల నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్‌బాసిద్, ఎంబీ .మౌలా, షాబుద్దీన్, సీనియర్ నాయకులు నూర్‌నిజామి, ఆర్‌డీజీ.బాషా, ఆరీఫ్, గఫార్, జిలాన్, కరీమ్, షబ్బీర్, ఆసీఫ్, సుబ్బారావు, రాఖీ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ, టీడీపీ నాయకులు వేర్వేరుగా అబుల్‌కలామ్‌కు నివాళులర్పించారు.